

# పంపకము

శ్రీ పూడి పెద్ది పాపారావు.

రామం కవరు విప్పి ఉత్తరం చదువుతాడు.

"అన్నయ్యా!"

ఇదివరకు నీకు రెండుమూడు ఉత్తరాలు రాసేను. అమ్మ నా దగ్గర ఉండవలసిన నాలుగు నెలలూ అయిపోయేయి. ఇప్పుడు నీవంతు వచ్చినది. అప్పుడే నీ మరదలు కస్సుబుస్సుమంటోంది. ఒక వేళ నీవు యే కారణం చేతనైనా రాలేక పోయినట్లు అయితే పది రూపాయిలు పంపించుతే అమ్మని తీసుక వచ్చి దిగపెడతాను.

ఇట్లు
నీ తమ్ముడు
బుచ్చి.

బాగుంది. నా పెళ్లం నాకే వండి పెట్టడం అపరూపంగా ఉంటే ఈ కుష్టురోగ ముండని దీపెడతానంటాడేమిటి, పది రూపాయలు పంపించాలట. దానిని భరించడమే కాకుండా పది రూపాయలు కూడా దండుగ. ఏం. ఆమాత్రం ఇంకో నాలుగు నెలలపాటు తల్లిని పోషిస్తే తప్పా. వెధవ. అని నేనో ప్రచారం చాలక ఆడారి వెధవని అయిపోయి పెళ్లం చేతుల్లో కీలుబొమ్మ అయిపోయేను కాని వాడూనా! అప్పుడే మరదలు తొందర పెడుతుందట. నా తల్లికి చాకిరీ చేస్తే చెయ్యిలేకపోతే పో అని కూతలు వెయ్యకూడదు అని అనుకుంటూ తమ్ముడికి ఉత్తరం వ్రాస్తాడు.

౨

బుచ్చి కాఫీ నీళ్లు త్రాగి, జెంబుకానా సిగరెట్టు కాలుస్తూ ఉంటే పోస్టుమేను కవరు పట్టుకొచ్చి యిస్తాడు. కవరు చించి ఉత్తరం చదవడం ప్రారంభిస్తాడు:

చిరంజీవి బుచ్చికి—

నీవు వ్రాసిన ఉత్తరం అందినది. ఇప్పటిలో అమ్మను తీసుకు వెళ్లలేను. మీ వదినకు ఒంట్లో ఏమీ బాగులేదు. స్వయం పాకం చేసుకొంటున్నాను. ఇప్పుడు నావంతు వచ్చింది. కాని కష్టం రావడము చేత నేను తీసుకు వెళ్లలేను. అంచేత మరి నాలుగు నెలలపాటు మీ యింట్లోనే అట్టే పెట్టుకున్నా సరే లేక మీ చిన్నన్నయ్య దగ్గరకి దిగపెట్టేసినా సరే.

ఇట్లు
రామం.

చాలా బాగుంది. ఒదినకి ఒంట్లో బాగుండడము లేదట. నెలకి నూటయాభై రూపాయిలు ఇస్తారు కదా వంటమనిషిని పెట్టుకోకూడదు. నేను ఏదో అచ్చి ఉన్నట్లు ఇంకో నాలుగు నెలలు ఉంచాలట. పిశినిగొట్టు. ఇప్పటికే కడుపు నిండిపోయింది చీవాట్లతోటి. ఇంకో నాలుగు నెలలంటే మా ఆవిడ పుట్టింటికి మూట ముల్లు కడుతుంది. అమ్మయ్యో! మా ఆవిడ లేకపోతే నా బ్రతుకెందుకు. సరే చిన్నన్నయ్యకి రాసి చూస్తా. వాడూ వీడిలాటి కసాయివాడు అయితే ఈ ముండని తీసుకెళ్లి వీధులో పారేసాను కాని యిక యింటిలో ఉంచను.

3

నారాయణమూర్తి (బుచ్చి చిన్నన్నయ్య) ఒక ముతకగుడ్డ కట్టుకొని నులక మంచంమీద కూర్చొని ఉంటాడు. చేతులో బుచ్చి రాసిన ఉత్తరం ఉంది. అతని భార్య పెద్దాపురం పట్టుచీర, జంఫరు, జంపరు జాకెట్టు ,ఊ' ఇవన్ని ఎంత కని చెప్పడం. ఇప్పటి కాలం పూర్తి వేషంలో ఆ పక్కనే ఉన్న పందిరి మంచంమీద కూర్చుంటుంది.

ఏమిటా కాగితము?

ఏముంది. మా తమ్ముడు రాసిన ఉత్తరం. మళ్లా ఆ శని గొట్టుముండని పంపిస్తాడట.

మీ అమ్మనా?

ఆ. అవును.

సరే. యికనేం. వెట్టి కుదిరింది రోకలి తలకి చుట్టమన్నాట్ట. ఇంకా మొన్ననే పిశాచాన్ని మెల్లిగా ఒదలుగొట్టుకుంటే మళ్లా నా పీకలమీదకే! మీ అన్నయ్యకి ఏమిటొచ్చింది. ఇప్పుడు అతని వంతు కాబోలు?

అవును, వదినకి సుస్తీగా ఉందట. అంచేత అమ్మని బుచ్చిగాడిదగ్గరే ఉండనివ్వమన్నాట్ట. లేకపోతే మన యింటికి పంపమన్నాట్ట. 'అబ్బా పాపము. ఏమి చవకగా ఉంది నాయిల్లు. వీళ్ల బాబుగారి డబ్బు ఏమేనా దాచపెట్టేడా ఏమిటి? ఇష్టముంటే ఇంకో నాలుగు నెలలు మీ తమ్ముడే ఉంచుకోవడము మానేసి యిక్కడికి తీసుకురమ్మనడము సబువేమిటి? అంతకంతకి ముదురుతోందే పాకము. అయితే మీ ఉద్దేశము ఏమిటి?'

,ఉద్దేశానికి ఏముంది. నీవు దుద్దులు కొనమంటున్నావాయె. ఎలా లేదనా నాలుగు అయిదు వందలు అవుతుంది. డబ్బు సర్దవద్దూ? డబ్బు సర్దుతే మాత్రం చాకిరీ ఎవరు చేస్తారు కుష్టురోగపు వానికి! మీరుమాత్రం నంగిరితనము వోడక "నేను తీసుకువెళ్లను. అట్టే ఆ విషయమయి రాస్తే మళ్ళా నావంతు వచ్చినప్పుడు కూడా సున్న చుట్టేస్తాను" అని నిర్మొగ మాటంగా రాయండి. మీరు వ్రాయలేకపోతే నే రాస్తాను తెండి.

ఎందుకులే నే రాస్తాను. ఆ మాత్రం మొగాడిని కానా?

౪

బుచ్చి వాళ్ల అమ్మ ఉన్న పాకలోకి వస్తాడు. ఆ పాకలో సూర్య రశ్మికి గాలికి కొదువలేదు. వర్షం పడ్డది అంటే ఆవుల పాకకన్న అర్ధాన్నం అయిపోతుంది. ఈ పాకలో సగం తెగిపోయిన నులక మంచం మీద వాళ్ల అమ్మ పడుకొని ఉంటుంది. ‹అమ్మా, అప్పుడే నీవు నాదగ్గిర ఉండవలసిన నాలుగునెలలు అయిపోయాయి. పెద్దన్నయ్యకి చిన్నన్నయ్యకి రాస్తే వాళ్లు తీసుకు వెళ్లలేమని రాసారు. మరి నేను పోషించలేను. నీ యిష్టంవచ్చిన చోటికి వెళ్లు.”

‹అయ్యో! నాయనా, నేను యిలాగా—’

అని ఏమో అంటూ ఉంటే బుచ్చి వెళ్ళిపోయాడు.

ఆవేళ మెయిలులోనే కనకందిగి తన అన్నగారి యింటికి (బుచ్చి యింటికి) ఒస్తూ ఉంటుంది. అది చూచి అంతవరకూ సినీమా స్టారులాగ తయారయి డాబామీద పచారు చేస్తూ ఉన్న మనిషి మంచంమీద ఏ వారం రోజులనుంచో లంఖణాలు చేసిన మనిషివలె పడక వేసేసింది. కనకం ఇంట్లోకి వచ్చి ఆమెను పలుకరించింది. సంగతి అంతా పసికట్టింది. “వదినా మళ్ళా మెయిలులో నేను తిరుపతి వెళ్ళాలి. అమ్మని కూడా తీసుకు వెళతాను” అంది. ఈ ఘటం ఎప్పుడు వదులుతుందా అని చూస్తూ ఉందేమో “అయ్యో నీమాటకు అడ్డు ఉందా. పాపం భోజనము చెయ్యలేదు కబోసు. మీ అన్నగారు హోటలులో భోంచేసి ఆఫీసుకు వెళ్లిపోయారు. వండుతాను భోంచేసి వెళుదువుగాని ఉండు” అవి లేవబోయింది. అబ్బెబ్బే, ఎందుకు వదినా, మళ్ళా రైలుకి టైము అయిపోతుంది. వస్తాను దయ ఉంచు అని కారు మాట్లాడి అందులో వాళ్ల అమ్మని ఎక్కించి ప్రయాణమయింది.

౫

కనకం వాళ్ల అమ్మని ఎన్ని మాటులు రమ్మనా వెళ్లింది కాదు. అంచేత కనకంతో వెళ్ళడం తల్లికి యిష్టం లేదు గాని అక్కడ ఉంటే తిండి ఉండదు. ఏమయినా ప్రాణం అంటే తీపి. కనకం తల్లిని ఇంటికి తీసుకెళ్లి ఎంతో శ్రద్ధగా చాకిరీ చేసి మంచి మందులు ఇప్పించి జబ్బు కుదిరేటట్టు చేసింది. జబ్బు కుదిరింది అని తెలియగానే “అమ్మని చూడాలని చాలా యిదిగా ఉంది. అంచేత తీసుకు వెళతాము అంటూ ముగ్గురు అన్నదమ్ములు పరుగెట్టుకొని వచ్చేరు.

“వీరు మళ్ళా ఏ మొగము పెట్టుకొని యిక్కడికి వచ్చారు. అప్పుడు పోషించడానికి పనికిరాని తల్లి యిప్పుడు చాకిరీ చెయ్యటానికి పనికి వచ్చిందా? మీకు సిగ్గులేదు. మీరు ఈవిడ అవసానకాలంలో పోషిస్తారని చెప్పి నాన్న యావదాస్తి మీ ముగ్గురి మొహాన్ని తగులబెడితే ఆ డబ్బు పుచ్చుకొని మీ భార్యలను సానివెధవల వలె తయారు చేసేరే. నాలుగు నెలలు అయిపోగానే ఒక్క రోజైనా భరించలేకపోయా వారే. పుత్రులట. రాక్షసులు. బ్రతికి ఉన్నప్పుడు అన్నం చచ్చిన తరువాత తద్దినం పెట్టకపోయిన తరువాత కొడుకులెందుకు. పాపము! తొమ్మిది నెలలు మోసి అబ్బా ప్రసవ సమయమున తల్లి పడే బాధ మీకు ఏమి తెలుసు! ఆమె బిడ్డని చూడగానే అంత బాధ మరచిపోయి అనంద భాష్పాలు రాలుస్తుందే. అప్పుడప్పుడు తల్లిచావుకు బిడ్డలే కారకులవుతారే. కొందరు తల్లులు ప్రసవ సమయమున ప్రాణాలు విడుస్తారే. బిడ్డ కొరకు ప్రాణము నయినా త్యజించు తల్లి మీకంటికి అంత సులువుగా ఉన్నదా! పెళ్లాల చెప్పు చేతలలో నుండి, తల్లి, తండ్రి వేయేల సర్వస్వము మరచి వారు చెప్పినట్లు నడచుకుంటారు. తల్లియొక్క విలువ ఆమె ఉన్నన్నాళ్లు తెలియదు. తల్లి లేకపోగానే ఆమె కొఅత తెలుస్తుంది. తండ్రియొక్క ఆస్తి పంచుకొనుటకేనా మీ శ్రద్ధ. అతి వృష్టి లేక అనావృష్టి. వ్యా అంటే ఒకటే భార్య మొహం. ఆమె చేతుల్లో కీలుబొమ్మ అయిపోవడం. లేకపోతే ఆమెను అష్టకష్టాలు పెట్టి ఆమె ప్రాణాలు తీయడం.” అని కనకం వారికి బుద్ధిచెప్పి తల్లినిమాత్రము పంపనని నిర్మొగమాటముగా చెప్పేసింది.

ఆహా ఎప్పటికయినా తల్లియందు కృతజ్ఞత చూపే వాళ్లు స్త్రీలే కదా!


## హస్తరేఖా శాస్త్రము

విశదముగా తెలియగల 300 చిత్రములతోగూడి స్త్రీలు బాలురు సైతము చదువుట కనుకూలించు తేట తెల్లంమగు నాంధ్ర వచనరూపమగు నీగ్రంధము చేత ఆయుస్సు వివాహలాభము, గుణము, శక్తి, బుద్ధి అదృష్టము, సంతానము లౌకిక సుఖము వ్యాజ్యము. శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొన వచ్చును. ఇంకను, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటిలోను యిది యగ్రస్థానంబును వహించియున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంథము కల్పవృక్షము వంటిదని దీని నామూలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట నెంతయు సందియంబు లేదు.



దీని వెల 2-0-0.

సాకారుపేట, ఆనందబోధిని ఆఫీసు. మదరాసు.